కథ

# మార్పు

స్వాతీ శ్రీపాద

**ఇది** ఇప్పటికి ఎన్నోసారి? సరిగ్గా గుర్తు లేదు.

ఎన్నేళ్ళుగా కొనసాగుతున్న భాగోతమిది?

ఇంట్లో ఎక్కడ చూసినా సందడే సందడి.

అమ్మకు ఎంత సంబరంగా వుందో

"పద్మా ఇదిగో ఈ చీర కట్టుకుంటావా? ఇది నీకు బాగా నప్పుతుంది కాని ఒద్దులే ఈ అంచు నలుపో ముదురు నీలమో తెలీటం లేదు. నలుపు శుభం కాదంటారుగా! ఎందుకైనా మంచిది.

ఈ చీర చాలా బాగుంది కాని కాటన్ కదా, వద్దు. మనను తక్కువగా అంచనా వేసుకుంటారేమో.

ఏదైనా పట్టుదే కట్టుకో.

ఇదిగో ఈ కనకాంబరం రంగు నీకు చాలా బాగుంటుంది.

మెరిసిపోతావు. దీని బ్లౌజ్ ఎలాగుంది, కుదిరిందిగా కాదంటే చేతులు మరీ మెగా స్లీవ్స్ పెట్టాడు కదూ..... ఫర్వాలేదు కాబోయే అత్తగారు కాస్త చదువుకున్న మనిషేలే".

అప్పుడే అత్తగారా?

అమ్మ ధోరణికి ముచ్చటేసింది.

చిన్నపిల్లలా ఎంత సంబర పడిపోతోంది.

"పెద్దవాళ్ల ముందు కాస్త వినయంగా వంచిన తల ఎత్తకుండా మాట్లాడు. అబ్బాయి చదువుకుని మంచి ఉద్యోగంలో ఉన్నాడు. ఒకవేళ ఏదైనా మాట్లాడతా నంటే కాస్త సిగ్గు పక్కకి పెట్టి చక్కగా మాట్లాడు"

ఆ మాటలు నన్ను ద్రవించేశాయి.

అంటే..... అంటే....

పెద్దవాళ్ళ కోసం, అతని కోసం.... వాళ్ళ మెప్పుదల కోసం ఏదైనా చెయ్యాలి.....

మరి నా సంగతో నాకో ఉనికి ఒక వ్యక్తిత్వం ఏవీ లేవా? ఏ రంగు సీసాలో పోస్తే ఆ రంగూ ఆకారంలో కనిపించే ద్రవాన్నా నేను?

కాదే ముప్పై సంవత్సరాల జీవితాన్ని చూసినదానను. నాకో అభిప్రాయం, ఒక విశిష్టత ఉన్నాయి.

అంతకు మించి మంచి ఉద్యోగం.....

"నాకే తప్పు నీకేం పట్టదా? ఎంతసేపూ నేను తాపత్రయపడటమే.... తొందరగా తయ్యారవు" అమ్మ మొహంలో అసహనం, అయినా గొంతు మాత్రం సౌమ్యంగానే ఉంచుకుంది.

తల ఊపాను.

ఏదో చెబ్దామని గుండె గొంతుకలో కొట్టుమిట్టాడింది. కాని ఇప్పుడు సమయం కాదు, సందర్భమూ కాదు.

* * *

అయితే మరెప్పుడు నా మనసు నన్ను నిలదీసింది.

తరువాత.... ప్రతిసారీ ఇంతే..... తరువాత ఇప్పుడు కాదు.

ఇప్పుడు మాత్రము గంగిరెద్దులా అలంకరించుకోవాలి.... వినయం నటించాలి, రాని నవ్వులు ఒలకబొయ్యాలి. అయిష్టంగానే చీర కట్టుకున్నాను వాటికి సరిపోయే హాంగింగ్స్, లిప్‌స్టిక్ చైన్ అన్నీ అమ్మ రెడీగా పెట్టిపోయింది.

నవ్వొచ్చింది.

ముప్పై సంవత్సరాల నేను మల్టీనేషనల్ కంపెనీ ఎగ్జిక్యూటివ్‌ను ఇప్పుడిలా సింగారించుకోవడం.....

పెళ్ళంటే ఏమిటో ఎందుకో తెలీని బాలా కుమారిని కాదు నేను. నా వడలిపోయిన పెదవుల మీద లిప్‌స్టిక్.... ఆకర్షణా తగ్గుముఖం పట్టిన వదనం మీద లాక్టో కాలమిన్ కోటింగ్ ఇవి అంత అవసరమా?

మనసు మాటే అఖ్ఖరలేదా?

ఉహు! ఇలా ఆలోచించే వాళ్ళ ముందుకు వెళ్ళేసరికి ఫ్రీజయిపోతాను.

అయినా తప్పదు.

ఇంట్లో హడావిడే వాళ్ళ రాకకు అద్దం పట్టింది.... ఓరగా వేసివున్న తలుపు సందులోంచి తొంగి చూశాను. తల్లి, తండ్రి, ఇద్దరూ అన్నాచెల్లెళ్లు.....

మా ఇంట్లో హడావిడి అమ్మానాన్నల్లోని ఆందోళన, నాలో ఉబికివచ్చే అసహనత.... కోపం పొంగి వచ్చింది.

కాని ఇది సమయం కాదు... సంబాళించుకోవాలి..... నాకిష్టమైన పాటను గుర్తు చేసుకున్నాను. ఇదో టెక్నిక్.... మనసును డైవర్ట్ చేసుకుందుకు... కాఫి ఫలహారాలు ముగిసినట్టున్నాయి.

"పద్మా" నాన్న పిలుపు.

లేచి వెళ్ళాను అందరికీ ఒకసారి చేతులు జోడించి నా వినయాన్ని ప్రదర్శించాను. చూపులతోనే నన్ను అంచనా వేస్తున్నారు. పెద్దవాళ్ళ కళ్ళల్లో కాస్తా ముభావమ్, అతని చూపుల్లో ఏదో వెతుక్కుంటున్న భావన ఆ అమ్మాయి కళ్ళు మాత్రం విప్పారాయి. వాళ్ళ శోధన ఫలితాలు నా గుండెకు వినిపిస్తూనే ఉన్నాయి.

నాలో స్త్రీత్వం బుసలుకొట్టింది.

ఏం కొలుచుకుంటున్నారు? రేప్పొద్దున పెళ్ళి తరువాత దొరకే సుఖాన్ని ఎలా కొలత వేసుకోగలదు? ఏ శరీర భాగాల్ను నగ్నంగా ఎక్స్‌రే కళ్ళతో చూస్తున్నాడు?

నాలోని ఆమెను కాళ్ళకింద నలిపేశాను. నాలోని నాకు ఏ స్థానమూ లేదక్కడ.

ఆవిడ ఎంత నిర్లిప్తంగా కనిపిస్తోందో అంత ఉగ్రనరసింహావతారాన్నీ దాల్చగలదని తెలుసు నాకు.

మెత్తని చూపులే కదా అణచివేత కత్తికి పదును పెట్టే ఆయుధాలు.

ఆవిడే అబ్బాయి తల్లి అని ఎవరు చెప్పాలి ఆ దర్పం చాలదూ?

అతనివంక చూశాను..... చూపులు తిప్పుకున్నాడు....

నా పెదవుల మీద చిన్న వంపు మొలకెత్తింది.

"పిల్లనేమయినా అడుగుతారా?"

అమ్మ స్వరంలో చిన్న వణుకు... నిశ్శబ్దాన్ని ముక్కలు చేసి పారేస్తూ....

పిల్ల! నాకు పేరు లేదు.... పిల్ల..... నేను పద్మను కానిప్పుడు ఓ పిల్లను.

"రోజులు మారిపోయాయి అమ్మాయి అబ్బాయి మాట్లాడుకోవాలి గాని మరేం లేదు...." తండ్రి జవాబు.

అంటే ఇంట్లో అతనిదే రాజ్యమన్నమాట...

ఎవరికి నోరువిప్పే స్వేచ్ఛ కూడా లేదన్నమాట....

అబ్బాయి..... ఎంత మర్యాద నేను మాత్రం పిల్లను...

తోలుబొమ్మలం... స్వేచ్ఛలేని తోలుబొమ్మలం....

కోపం వరద వుధృతి కట్టలు తెంచుకుంది. తలెత్తాను. అందరిదృష్టి అతనిపైనే.

"మీ అమ్మాయితో కాస్సేపు ఏకాంతంగా మాట్లాడాలి మీ కభ్యంతరం లేదుగా?"

నాన్న నదుగుతున్నాడు.

నన్నే అడగవచ్చుగా? ఎదురుగా వున్నానుగా?

అభ్యంతరం దేనికి అల్లాగే పెరట్లోకి వెళ్ళి మాట్లాడుకోండి లేదా లోపలి గదిలో.... మీ ఇష్టం..."

ఇదేమాట వీళ్ళు నన్ను అడగలేదెందుకు? అబ్బాయితో ఏదైనా మాట్లాడతావా అని.

* * *

అమ్మ నా చెయ్యి పట్టుకుని లోపలికి తీసుకువచ్చింది. "అబ్బాయితో సవ్యంగా మాట్లాడు" వెళ్ళేముందు నా చెవిలో గుసగుస.

కాస్సేపటికి అతనా గదిలోకి వచ్చాడు తలుపు తీసేవుంది. కాస్సేపు నిశ్శబ్దపు కుప్ప మా ఇద్దరినీ నిస్సత్తువుగా చూస్తూనే వుంది. అతను మాట్లాడటం మొదలెట్టాడు. అతని చూపు గోడమీద వాల్‌పోస్టర్ మీద వుంది. స్వరంలో మాత్రం అర్థం కాని ఆత్మీయత..... ఏదో చెప్పబోయి ఆగిపోయాను...

అతను నవ్వి తన మాటలు కొనసాగించాడు...

వినడం తప్ప నాకు మరో దారే లేదు.

"ఉద్యోగం చేస్తున్నా, ఐ మీన్ పెళ్ళయ్యాక ఇల్లంతా నువ్వే చక్కబెట్టుకోవాలి, అమ్మ ఇన్నాళ్ళూ చేసి చేసి అలసిపోయింది. చెల్లాయి రేపోమాపో పెళ్ళయితే వెళ్ళిపోయే పిల్ల..."

ఇదేనా మొదటి మాటా? చిన్నబుచ్చుకుంది నా మనసు.

"అలాగని ఉద్యోగం మానేసే స్థితిగతులు కావు మనవి... మధ్యతరగతి వాళ్ళం.

మరోటి దుబారా ఖర్చులు, చీరసారెలకు వేస్ట్ చెయ్యడము నచ్చదు నాకు."

జవాబివ్వలేదు నేను. నిర్లిప్తంగా చూశాను. నా ఉద్యోగం నీకు తెలుసుగా... ఎప్పుడు ఇంటికి వస్తానో నాకే తెలీదు.... ఇంట్లో గొడవలు, సమస్యలు లేకుండా చూసుకోవలసిన బాధ్యత నీదే...."

పెదవి కొరుక్కున్నాను కసిగా...

నేనేమీ చెప్పదలచుకోలేదు. అతను నన్నేమీ అడగలేదు.. అడిగితే కాని నేనేమీ చెప్పను.

"నా భార్య అన్ని విధాల అందరికీ ఇష్టురాలవాలి....."

అనుమానంగా నావంక చూశాడు.

నానించి ఆశించిన జవాబులు రాలేదులా వుంది.

" " మరొక్కమాట పనివాళ్ళు వంటవాళ్ళు నాకు నచ్చరు..... అన్ని పనులూ నువ్వే చెయ్యాలి.... చిన్నప్పట్నించీ అమ్మే అన్నీ చేసేది"

ఏం చెప్పను?

అతనో ఇమేజ్ ఏర్పరచుకున్నాడు.... నేను మాత్రం నా అస్థిత్వాన్ని వదులుకుని అతని భార్య రూపంలో ఒదిగిపోవాలి.

* * *



మార్చి 27, 2009న మచిలీపట్టణంలో జరిగిన 'విరోధి' ఉగాది వేడుకల సందర్భంగా కృష్ణాజిల్లా కలెక్టరు ఎన్.శ్రీధర్ గారి చేతుల మీదుగా సత్కారం అందుకుంటున్న కవయిత్రి కోపూరి పుష్పాదేవి.
చిత్రంలో ఇంకా పౌర సంబంధాల శాఖాధికారి కె.జయరావు గారు, డీఆర్వో వి.వి.సుబ్బారావు గారు ఉన్నారు.

ఎంతసేపూ నా భార్య ఇలా వుండాలి, అలా వుండాలి అంతే గాని నా మాటేమిటి?

నా నిశ్శబ్దమే ఓ పెద్ద వ్యక్తిత్వ ఘోష. అతనికి వినిపించడం లేదా?

నాకు మనసులో ఏమూలో స్ఫురిస్తూనే వుంది.... అతను ఎప్పటికీ నా మనసును వినలేడని... అయినా నువ్వేం ఆశిస్తున్నావని అడుగుతాడేమోనని ఎదురు చూస్తున్నా...

నిజంగా అడిగితే ఏం చెప్పాలి? నేనెంత అల్పసంతోషిని....నా ఇల్లు, నా భర్త, నా పిల్లలు అంతే....

కాని అతను అడగలేదు.

అతనేనా పెళ్ళిచూపుల ప్రహసనం ముగిసి వాళ్ళు వెళ్ళిపోయాక కూడా ఇంట్లో ఎవ్వరూ నన్నడగలేదు – నాకతడు నచ్చాడా లేదా అని.

....నాకేం కావాలి అని.....

నేను నోరు విప్పి ఎవరికి ఏమీ చెప్పలేదు....

ఆ రాత్రి ఎంత ప్రయత్నించినా కంటి మీదకు కునుకు రాలేదు.

ముప్ఫై సంవత్సరాలు... అంతే కద.... ఇబ్బందులు పరిశ్రమ... అన్నీ దాటి ఇప్పుడు ఈ వడ్డించిన జీవితాన్ని మరొకరి కోరికలకు బలిపీఠం ఎక్కించనా?

ఎంతసేపూ నేను నా అనుకునే మనిషి జీవితంలో నా ఉనికి ఏమిటి?

ఏదో కల.... పరీక్షలు.... టైమ్ అయిపోతోంది.... ఏమీ రాయలేక పోతున్నాను.... ఫేలయిపోతానా? ఒళ్ళంతా చమటతో తడిసి ముద్దైంది.

చటుక్కున మెలకువ వచ్చింది.

గొంతు తడారిపోయింది.

ముప్ఫై ఏళ్ళు అరవైలో సగమే కద! ఓ రకమైన నిశ్చింత.

తెల్లవారి తేలికైన మనసుతో ఆఫీస్‌కి వెళ్ళాను.

లంచ్ టైమ్‌లో తీరిగ్గా టెర్రేస్ పైకెక్కి నిన్న అతనిచ్చిన సెల్‌కి రింగ్ చేశాను.

అతను ఫోనెత్తి "ఒక్క రెండు నిముషాలు నేనే కాల్ చేస్తాను" అన్నాడు.

ఇదికూడా ఒక రకమైన ఆజ్ఞ లానే వుంది.

ఆ రెండు నిముషాలు కూడా నేను నా భార్య అనే అతని స్వరమే నా చెవుల్లో గింగురుమంది.

* ❈ *

"చెప్పు పద్మా" అతని స్వరం.

"మంచి రోజు చూసుకుని చెబ్దామనుకున్నాము. నెలలోగా పెళ్ళి జరగాలి..." ఏదో చెప్పుకుపోతున్నాడు. ఒక్కమాటా నా చెవికి సోకలేదు.

* ❈ *

"హలో... వింటున్నావా?"

"నన్ను నేను స్థిమితపరచుకున్నాను."

"ఒక్కమాట నావైపు నుండి వింటారా?... ముప్పయి ఏళ్ళు నేను నిర్మించుకున్నది నా వ్యక్తిత్వాన్ని.... ఒక ఆడతనాన్ని కాదు.... ఒక్క శారీరక సుఖం కోసం నేను నా ఉనికిని కోల్పోనవసరం లేదనిపిస్తోంది. మీకు తెలుసు నేను మా అమ్మానాన్నకు ఒక్కదాన్నే సంతానం.... ముప్ఫై ఏళ్ళు నన్ను పెంచిన దానికి బదులుగా వాళ్ళనో పదేళ్ళయినా చూడాలి కద..."

"పద్మా.... ఆర్ యూ క్రేజీ... ఇంతకీ ఏం చెప్పదలచుకున్నావు?"

"లేదు... మిస్టర్.... మీపేరైనా నాకు తెలీదు... నన్నుమాత్రం మీరు ఏకవచనంలో పిలవగలుగుతున్నారు."

ఓ.కె. నాదీ ఒక కండిషన్... మా అమ్మా నాన్న నాతోనే వుంటారు... నా సంపాదన విషయంలో రెండో మనిషి ప్రసక్తి నేను సహించను. ఇవి మీకు ఇష్టమైతే ఓ.కె. లేదు.... మరో సంబంధం చూసుకోమని మావాళ్ళకు చెప్పండి...

కాదంటే ఈ మాటే మీకు జవాబుగా వస్తుంది... అంతా మీ ఇష్టం..."

దృఢమైన నిర్ణయంతో ఫోన్ స్విచ్ఛాఫ్ చేశాను.

## పరాన్నులు

సమున్నత శిఖరం మీద
మన పాదాలు
అంచుల్ని ముద్దాడుతున్నపుడు
అప్రమత్తంగా వుండి
సమస్త శరీరాన్నీ మన
అదుపులో వుంచుకోకపోతే
మన కాయమే మాయం కావొచ్చు.
పెన్సిలు శూర్పణఖ ముక్కుకోసే
దక్షిణ హస్త లక్ష్మణుడు
దృష్టినంతా శూర్పణఖ మీద
కేంద్రీకరించక అలక్ష్యం చేస్తే
ఆమెను ఒడిసిపట్టుకున్న
వామహస్త రాముడికే ముప్పు
హస్తాల రుషులు
పనుల ఫలాలు పండిస్తున్నప్పుడైనా
పాదాల మునులు
నడక యజ్ఞం చేస్తున్నపుడైనా
అవరోధాల రక్కసి మూకల్ని
నిరోధించడానికి
అక్షుల రామలక్ష్మణుల దృష్టినంతా
వాటి మీదే లగ్నం చేయాలి
దృక్కుల్ని పరాన్నుల్ని చేసి
నిర్లక్ష్యపు నిశీధిలోనే వుంచి
చేస్తున్న పనిమీద నుంచి
గనుక మళ్లిస్తే దృష్టి
గతి తప్పుతుంది మనం చేసే సృష్టి

– మాధవీ సనారా